

మరింత.. సహకారం

హనుమకొండ, డిసెంబర్ 30 ఆంధ్రజ్యోతి : సహకార సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోబోంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను (పీఏసీఎస్) ఆధునికీకరించేందుకు ఉపక్రమిస్తోంది. అన్ని పీఏసీఎస్‌లలో డిజిటల్ సేవా పోర్టల్‌లో అందుబాటులో ఉన్న అన్ని రకాల సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ), మీ సేవా లాంటి ఆన్‌లైన్ సేవలను ప్రవేశపెట్టి ప్రజలకు సేవలను అందించడంతో పాటు సంఘాలకు ఆదాయం సమకూర్చి బలోపేతం చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 92 పీఏసీఎస్‌లకు ఆర్థిక పరిపుష్టి సమకూరనుంది. గతంలో ఉమ్మడి జిల్లాలో 232పీఏసీఎస్‌లు ఉండగా.. ఎన్టీఆర్ హయాంలో నష్టాల్లో ఉన్న సంఘాలను లాభాల్లో ఉన్న వాటిలో విలీనం చేయడంతో వీటి సంఖ్య 92కు తగ్గింది. అయినా చాలా సంఘాలు ఆర్థిక పరిపుష్టిలేక రైతులకు పూర్తి స్థాయిలో సేవలను అందించలేక పోతున్నాయి. వీటిని బలోపేతం చేయడానికి గత ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకున్నాయి. సహకార రంగంలో సంస్కరణల ఫలితంగా ఇటీవల వీటి పరిస్థితి కొంత మెరుగైంది. అయితే వీటిని మరింత బలోపేతం చేసేందుకు కసరత్తు జరుగుతోంది. పీఏసీఎస్‌లు రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాల విక్రయం, వ్యవసాయ రుణాలు అందచేయడం లాంటి సేవలను అందిస్తున్నాయి. వీటితో పాటు పెట్రోల్ బంకుల నిర్వహణ, గోదాముల నిర్మాణం, సూపర్ మార్కెట్ల ఏర్పాటు లాంటి వ్యాపారాల ద్వారా అవి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు నాబార్డు వాటికి రుణసహాయాన్ని కూడా అందజేస్తోంది. దీనితో ఉమ్మడి జిల్లాలోని కొన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు కొత్త వ్యాపారాల్లోకి అడుగు పెట్టి లాభాలు గడిస్తున్నాయి.

- సొసైటీల బలోపేతానికి కేంద్రం కార్యాచరణ
- త్వరలో అందుబాటులోకి 23 రకాల డిజిటల్ సేవలు
- కామన్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటు
- ఇప్పటికే పెట్రోల్ బంకులు, గోదాముల నిర్మాణానికి అనుమతి
- ప్రభుత్వ నిర్ణయంతో సమకూరనున్న ఆర్థిక పరిపుష్టి
- ఉమ్మడి జిల్లాలో 92 సహకార సంఘాలు
- సాంకేతిక సహకారం లేకుండా సాధ్యమేనా?
- పల్లెల్లో ఇంటర్నెట్ పని చేయక ఇబ్బందులు

23 రకాల సేవలు

కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా పీఏసీఎస్‌లో కామన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి కేంద్ర, రాష్ట ప్రభుత్వాల సేవలను వీటి ద్వారా అందిస్తారు. దీని కోసం ఇప్పటికే ఆయా సంఘాల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు, సీఈవోలకు సాంకేతిక శిక్షణ అందించారు. కేంద్రాల ఏర్పాటు కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. ప్రజలకు ఆధార్ కార్డు ద్వారా నగదు తీసుకునేలా మినీ ఏటీఎం, ఆదాయం, ఇంటి పన్నులు, విద్యుత్ బిల్లులు, బీమా పించన్లు, రుణాల చెల్లింపులు, ఆధార్ ఎన్‌రోల్‌మెంట్, అప్‌డేట్, ఆధార్ అనుసంధాన ప్రక్రియ లాంటి పనులు చేయనున్నారు. రుణాలు పొందేందుకు దరఖాస్తులు, పాస్‌పోర్టు, రిజిస్ట్రేషన్లు, మొబైల్, డీటీహెచ్ రీచార్జ్‌లు, పాన్, ఓటరు గుర్తింపు కార్డులు లాంటివి చేసుకునే వెసులుబాటు కల్పిస్తారు. ఎల్‌పీజీ సౌకర్యం, వ్యవసాయం, స్కిల్ డెవలప్‌మెంట్, హెల్త్ సర్వీసులు, ఎంప్లాయిమెంట్ సేవలందించనున్నారు. రేషన్‌కార్డు, ఓటరు కార్డు దరఖాస్తు, వాహన బీమా, డ్రైవింగ్ లైసెన్సు, ఈపీఎఫ్ సేవలు, ఐటీఆర్ ఫిల్లింగ్, ఎన్‌పీఎస్ రిజిస్ట్రేషన్, విమానం, రైల్వే, బస్సు బుకింగ్, న్యాయ సలహాలు, ఈ-స్టోర్, ఈ-శ్రమ్ కార్డు, పీవీసీ కార్డు, డాక్‌మిత్ర స్పీడ్ పోస్టు, ఫసల్ బీమాయోజన, ఎల్ఐసీ చెల్లింపులు, ఆయుష్మాన్ భారత్, జీవన్ ప్రమాన్ లైఫ్ సర్టిఫికెట్, హెల్త్ ఇన్సూరెన్స్, తదితర సేవలను సంఘాల ద్వారా జరిగేలా ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు రైతులకు అవసరమైన ప్రతీ వస్తువు కొనుగోలు చేసేందుకు సంఘంలోనే ఆన్‌లైన్ నమోదు చేసుకునే అవకాశం కల్పిస్తారు. జనరిక్

మిగతా 6వ పేజీలో...

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



మహబూబాబాద్ ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మెకు సంఘీభావం ప్రకటించి మాట్లాడుతున్న పీఆర్‌టీయూ-టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర విద్యాశాఖలో కీలక పాత్ర పోషిస్తున్న సమగ్రశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పీఆర్టీయూ-టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి 25వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరాన్ని పీఆర్టీయూ-టీఎస్, ఎమ్మార్పీఎస్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం జిల్లా నాయకులు వేర్వేరుగా సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ-టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. గత 18 ఏళ్లుగా తక్కువ వేతనాలతో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి మాటకు కట్టుబడి ఉంటారని మీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య మాట్లాడుతూ...ఎస్ఎస్ఏ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘీభావం ప్రకటించిన వారిలో నాయకులు సంకా బద్రీనారాయణ, మిర్యాల సతీష్‌రెడ్డి, గీత, కల్లెం వెంకటరెడ్డి, రాంజీనాయక్, తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు జెర్రిపోతుల వెంకన్నగౌడ్ ఉన్నారు. ఈ సమ్మెలో ఉద్యోగులు వీరన్న, సుమలత, మున్నీ, నీలిమా, సరస్వతి, నవీన్, భాస్కర్‌రావు, ఉదయ్, గణేష్, ప్రభాకర్, అనిల్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని మెడికల్ షాపులపై చర్యలు

- జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉమారాణి

తొర్రూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా మెడికల్ షాపులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని డ్రగ్ జిల్లా ఇన్స్‌పెక్టర్ ఉమారాణి హెచ్చరించారు. తొర్రూరులో మెడికల్ షాపులను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ షాపుల నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారని, తొర్రూరులోని షాపుల్లో చాలా మంది ఇతరుల పేరుతో లైసెన్సు తీసుకుని వ్యాపారాలు చేస్తున్నారని వారిపై చర్యలుంటాయన్నారు. మెడికల్ షాపు లైసెన్సు ఎవరిపేరున ఉంటే వారే వ్యాపారం చేయాలన్నారు. కవిత హాస్పిటల్ ఆవరణలో నిర్వహిస్తున్న సిద్ధార్థ మెడికల్ షాపులో ఫార్మాసిస్టు లేకుండానే ఆస్పత్రి సిబ్బంది మందులు విక్రయించ డంతో 5 రోజుల పాటు సీజ్ చేస్తున్నట్లు తెలిపారు.

బతుకులు తెల్లారేదెన్నడు..?



వేతనాల కోసం జీపీ కార్మికుల నిరీక్షణ..?

- ఆరు నెలలుగా అందని వేతనాలు
- జిల్లాలో 487 జీపీలో 1802 మంది సిబ్బంది
- ప్రభుత్వం స్పందించి విడుదల చేయాలని వేడుకోలు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న జీపీ కార్మికులు గత ఆరు నెలలుగా వేతనాల కోసం నిరీక్షిస్తున్నారు. గ్రామాల్లో వివిధ కెటగీరిల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణభారంగా మారిందని సిబ్బంది వేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 487 గ్రామపంచాయతీల్లో 1802 మంది జీపీ కార్మికులు ఆయా కేటగిరిల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది జనవరి 31న సర్పంచ్‌ల పదవి కాలం ముగిసిన నాటి నుండి నేటి వరకు పూర్తిస్థాయిలో వేతనాలు రాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామపంచాయతీల్లో చెక్కులు వేసినప్పటికి ఫ్రిజింగ్‌లోనే ఉన్నాయి. దీంతో వేసిన చెక్కులు రాకపోవగా, కొత్తజీతాల చెక్కులు ఇవ్వడానికి అధికారులు నిధులు కొరతతో ఇబ్బందులు పెడుతున్నట్లు జీపీ కార్మికులు వాపోతున్నారు. ఉన్న నిధులను ట్రాక్టర్ ఈఎంఐ, శానిటేషన్, డీజిల్, తదితర ఖర్చులకు మాత్రమే సరిపోతుందని అధికారులు చెబుతూ.. వేతనాలు ఇవ్వకుండ దాట వేస్తున్నారు. సంక్రాంతి పండుగకైనా తమకు వేతనాలు మంజూరు చేస్తే సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకుంటామని, లేని పక్షంలో పండుగకు పస్తులే ఉండాల్సిన దుస్థితి నెలకొందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇందులో కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, బిల్ కలెక్టర్లు, స్వీపర్లు, ఎలక్ట్రీషన్స్ ఉన్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి తమ వేతనాలను విడుదల చేయాలని కార్మికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



అమనగల్ గ్రామపంచాయతీలో వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్న జీపీ సిబ్బంది (ఫైల్)

మండలాల వారీగా జీపీ కార్మికులు ఇలా...

మండలం	గ్రామాలు	జీపీ కార్మికులు
బయ్యారం	29	121
చిన్నగూడూరు	11	44
దంతాలపల్లి	18	83
డోర్నకల్	30	113
గంగారం	12	31
గార్ల	20	104
గూడూరు	41	158
కేసముద్రం	42	211
కొత్తగూడ	24	71
కురవి	55	163
మహ-బాద్	41	131
మరిపెడ	48	119
నర్సింహులపేట	23	113
నెల్లికుదురు	36	159
పెద్దవంగర	26	72
తొర్రూరు	31	109
మొత్తం:	487	1802

జీపీ సిబ్బంది డిమాండ్‌లు ఇవే...

- రెండో పీఆర్సీ పరిధిలోకి గ్రామపంచాయతీ సిబ్బందిని తీసుకురావాలి.
- గ్రామ పంచాయతీ సిబ్బందిని అందరిని రెగ్యూలర్ చేసి వేతనాలకు ప్రభుత్వమే ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి.
- జీవో 51ని సవరించి మల్టీపర్పస్ విధాన రద్దు చేయాలి
- పాత పద్ధతిని కొనసాగించాలి.
- కారోబార్, బిల్లు కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి.
- ప్రమాదం జరిగి మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.
- ప్రమాదంలో మరణించి కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.
- గత ప్రభుత్వం ప్రకటించిన రూ.5లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని తక్షణమే అమలు చేయాలి
- 2001 జనాభా ప్రకారం కాకుండా పంచాయతీ అవసరాల నిమిత్తం కార్మికులను తీసుకోవాలి.
- పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా, గ్రాంట్ సౌకర్యం కలిపించాలి.
- గ్రామ పంచాయతీ సిబ్బందికి రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలి.
- ప్రమాదంలో మరణించి కార్మికుడి దహన సంస్కరణలకు రూ.10వేలు కాకుండా రూ.20వేల ఆర్థిక సహాయం అందించాలి.
- ఆదాయం ఉన్నా గ్రామపంచాయతీల్లో వేతనాలు పెంచుకునే అనుమతి ఇవ్వాలి.
- ఉమ్మడి రాష్ట్రం గుర్తింపు కార్డు తొలగించి తెలంగాణ రాష్ట్ర గుర్తింపు కార్డు ఇవ్వాలి.

నిధులు రాగానే వారికి వేతనాలు అందిస్తాం

- హరిప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాగానే ఆయా జీపీల్లో పనిచేస్తున్న సిబ్బందికి వేతనాలు అందజేస్తాం. సంవత్సర కాలంలో ఆరు నెలల వేతనం మాత్రమే కార్మికులకు చెల్లించాం. మిగతా ఇటీవల కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిధుల నుంచి జీపీ విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐలు చెల్లించాం. మిగిలిన నిధుల నుంచి జీపీ సిబ్బందికి వేతనాలు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో పెరిగిన సైబర్ నేరాలు

- 688 కేసులు.. 16 హత్యలు, 12 రేప్‌లు, 29 ఫోక్సో కేసులు నమోదు
- 2024 నేర వివరాలను వెల్లడించిన ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్



మహబూబాబాద్ టౌన్‌పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ 2024 సంవత్సర నేర నివేదికను ఆవిష్కరిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా వ్యాప్తంగా 2024 సంవత్సరంలో సైబర్ నేరాల కేసులు ఎక్కువ సంఖ్యలో నమోదయ్యాయని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. మహబూబా బాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ 2024 క్రైమ్ రి పోర్టు బుక్‌లెట్‌ను విడుదల చేశారు. అనంతరం ఎస్పీ సుధీర్‌రా మ్‌నాథ్ కేకన్‌ను కేసుల వివరాలను వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో 26 గంజాయి కేసులు నమోదు చేసి 51మంది నిందితులను అరెస్టు చేసి 710 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరోపక్క 16 హత్య కేసులు, 12 రేప్ కేసులు, 29 పోక్సో కేసులు, 29 ఎస్సీ అట్రాసిటీ కేసులు, 32 ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైనట్లు చెప్పారు. 273 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోగా అందులో 129 మంది మృతి చెందినట్లు చెప్పారు. 97పీడీఎస్ బియ్యం కేసులు నమోదు చేసి 1818.5 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 146 నల్ల బెల్లం కేసులు నమోదు కాగా, 1,28,988కేజీల బెల్లం, 8,604కేజీల పటికను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 859మద్యం కేసులు నమోదు చేసి 32382.3 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న 146 మందిపై కేసు నమోదు చేసి 196 వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. 4073 మంది మద్యం తాగి వాహనం నడపడంతో పాటు 23,967 మంది ఈ చలాన్లు చెల్లించని వారిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. సమావేశంలో డీఎస్పీలు తిరుపతిరావు, కృష్ణకిశోర్, మోహన్, విజయప్రతాప్, శ్రీనివాస్, సీఐలు పెండ్యాల దేవేందర్, సర్వయ్య పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని యువకులు, ప్రజలు అత్యుత్సాహం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ సోమవారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడిపినా.. మద్యం మత్తులో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అర్థరాత్రి ఆరుబయట వేడుకలకు అనుమతులు లేవన్నారు. సెక్షన్ 30 పోలీస్‌యాక్ట్, సెక్షన్ 144 సీఆర్‌టీసీ అమలులో ఉన్నందున బహిరంగప్రదేశాల్లో ఐదుగురు లేదా అంతకన్నా ఎక్కువగా వ్యక్తులు ఒకచోట గుమికూడడం నిషేధమన్నారు. ఆరు బయట ప్రదేశాల్లో డీజేలు, ఎక్కువ శబ్దాలను ఇచ్చే సౌండ్ సిస్టంను వినియోగించకూడదన్నారు. మద్యం సేవించి రోడ్లపై వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డిసెంబర్ 31న రాత్రివేళ కేకలు వేస్తూ వాహనాలపై తిరగకూడదని చెప్పారు.

మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన, ఈవ్ టీజింగ్‌కు పాల్పడిన చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి



గ్రీవెన్స్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి

అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మాచారి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌ను నిర్వహించారు. జిల్లా నలమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 104 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రీవెన్స్‌పై ఎంతో నమ్మకంతో ప్రజలు వస్తారని దరఖాస్తులను పరిష్కరించి వారి నమ్మకాన్ని పెంచాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు మధుసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, పురుషోత్తం, రవీందర్‌రెడ్డి, నర్సింహాస్వామి, డాక్టర్ కిరణ్‌కుమార్, మరియన్న, వేముల సురేష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



సరస్వతి పుష్కరాలపై మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లికలెక్టరేట్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరిగే సరస్వతి పుష్కరాలకు మాస్టర్ ప్లాన్ సిద్ధ చేయాలని అధికారులను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. మహదేవపూర్ మండలంకాళేశ్వరంలో మేలో జరిగే పుష్కరాల నిర్వహణపై దేవాదాయ, పంచాయతీరాజ్, సమాచార, రెవెన్యూ, విద్యుత్, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. పుష్కరాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయం ఎంతో కీలకం అన్నారు. సమాచారం భక్తులు సులభంగా తెలుసుకునేందుకు వీలుగా మ్యాపింగ్ తయారు చేయాలని ఆదేశించారు. వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు గుర్తించడానికి వీలుగా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. భక్తుల కోసం తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులను నడపాలన్నారు. పుష్కరాల సందర్భంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసు శాఖ చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, డీపీఆర్వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవ చేయడంలో ఉన్న తృప్తి వెలకట్టలేనిది

ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి



లయన్స్ ప్రతినిధులతో శ్రీనివాస్‌రెడ్డి

జనగామ కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసేవలో ఉన్న తృప్తి వెలకట్టలేనిదని ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి జనగామ జిల్లా కేంద్రంలో లయన్స్ శీలా రీజియన్ మీట్ ఘనంగా జరిగింది. రీజియన్ చైర్మన్ కలువల భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. అవసరార్థులను ఆదుకుంటున్న లయన్స్ సేవలను కొనియాడారు. కరోనా సమయంలో ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన సంగతి ప్రతిఒక్కరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో పూర్వ జిల్లా గవర్నర్ కన్నా పరశురాములు, ప్రతినిధులు ఉపేందర్‌రెడ్డి, గోలి అమరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రెడ్డి, శివరామకృష్ణ, బాలకృష్ణ, సురేష్‌కుమార్, వేణుగోపాల్, శ్రీరాం శ్రీనివాస్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ ద్వారానే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

జనగామ కల్చరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ టీఎస్ ద్వారానే ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారమవుతాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం జనగామ జిల్లా కేంద్రంలో అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమావేశం జిల్లా అధ్యక్షులు కొల్ల మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ప్రధాన కార్యదర్శి నూకల ఎల్లారెడ్డి సమన్వయకర్తగా వ్యవహరించగా శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 53 సంవత్సరాలుగా అనేక సమస్యలను పరిష్కరించి అనేక జీవోలను తీసుకువచ్చిన ఘనత పీఆర్‌టీయూకే దక్కుతుందన్నారు. అనంతరం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి, అయితా నర్సింహులు, అంజయ్య, గోలి తిరుపతిరెడ్డి, వంటేరు మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గన్ విక్రయానికి ప్రయత్నించిన ముఠా అరెస్టు

తుపాకీ, రెండు తూటాలు, కారు, ఐదు మొబైల్స్ స్వాధీనం

వివరాలు వెల్లడించిన మానుకోట ఎస్పీ



పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లాలోని కేసముద్రం మండలం ఉప్పరపల్లి క్రాస్‌రోడ్డు వద్ద తుపాకీ(గన్) విక్రయానికి పాల్పడుతున్న ఓ ముఠాను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన అందెం గోపి కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాజస్థాన్ రాష్ట్రం ఆహోర్ మండలం నీల్కాత్ గ్రామానికి చెందిన గోసామి ప్రవీణ్‌భారతిలు కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. కేసముద్రం మండలం పెనుగొండ గ్రామానికి చెందిన మాధవపెద్ది శ్రీకాంత్‌రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. సీరోలు మండలం చింతపల్లి గ్రామానికి చెందిన దొంతగాని సందీప్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వరంగల్ జిల్లా బట్టుపల్లి గ్రామానికి చెందిన మెరుగు సిద్ధార్థ, రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఇమ్రాన్ ఖాన్‌లు ముఠాగా ఏర్పడినట్లు చెప్పారు.

2020లో ఓ గంజాయి కేసులో చింతపల్లి గ్రామానికి చెందిన అందెం గోపి, రాజస్థాన్‌కు చెందిన ప్రవీణ్‌భారతి రాజమండ్రి జైలు వెళ్లగా అక్కడ కేరళకు చెందిన జయరాం, ఒడిస్సాకు చెందిన చంద్రశేఖర్‌లు పరిచయం అయినట్లు చెప్పారు. చంద్రశేఖర్‌తో జయరాం తనకు బిజినెస్ పరంగా ఒక తుపాకీ కావాలని అడుగగా చంద్రశేఖర్ అందెం గోపిని సంప్రదించినట్లు చెప్పారు. దీంతో గోపి రాజస్తాన్‌కు చెందిన ప్రవీన్‌భారతితో చెప్పగా, అదే రాష్ట్రానికి చెందిన ఇమ్రాన్‌ఖాన్ వద్ద గోపికి ఒక తుపాకీ, రెండు తూటాలు ఇప్పించినట్లు చెప్పారు. ఆ తర్వాత చంద్రశేఖర్ ఆ తుపాకీ వద్దని చెప్పగా దానిని విక్రయించేందుకు రాజస్థాన్ నుంచి హైదరాబాద్, కాజీపేట మీదుగా వయా కేసముద్రం మీదుగా క్రాస్‌లో వెళ్తున్నారు. ఉప్పరపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు చేపట్టగా.. కారును తనిఖీ చేయడంతో తుపాకీ, రెండు తూటాలు, 5 సెల్‌ఫోన్‌లు లభ్యమైనట్లు చెప్పారు. తుపాకీకి సంబంధించి వారి వద్ద వివరాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. వారిని విచారించగా తాము ఆరు నెలలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే తిరుగుతూ.. కేసముద్రం మండలం వీరారెడ్డిపల్లెలో ఓ కిరాణా షాపులో చోరీ, నెక్కొండ మండలంలోని రెడ్లాడ గ్రామ శివారు తండాలో మేకలు దొంగతనం చేసినట్లు వారు నేరాలను ఒప్పుకున్నట్లు ఎస్పీ తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించగా ఇమ్రాన్‌ఖాన్ పరారీలో ఉన్నట్లు చెప్పారు. మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు ఆధ్వర్యంలో కేసును చాకచక్యంగా చేధించిన మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజ్, సీసీఎస్ ఎస్సై తహెర్‌బాబాలను అభినందించి రివార్డులను అందించారు. తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్, మోహన్, విజయప్రతాప్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

జనగామ ఏఎస్పీగా చేతన్ నితిన్



జనగామ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జనగామ ఏఎస్పీగా ఐపీఎస్ అధికారి పండెరె చేతన్ నితిన్ నియమిస్తూ డీజీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మహారాష్ట్రకు చెందిన చేతన్ నితిన్ 2022 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ప్రస్తుతం గ్రేహౌండ్స్ విభాగంలో పని చేస్తున్న ఆయనను జనగామ ఏఎస్పీగా ప్రభుత్వం నియమించింది. ఆయన ఏఎస్పీ హోదాలో జనగామ ఏసీపీగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కాగా ప్రస్తుతం జనగామ ఏసీపీ (పూర్తి అదనపు బాధ్యతలు)గా ఉన్న పార్థసారధి పాత పోస్టింగ్ అయిన వరంగల్ కమిషనరేట్ పరిధి లోని స్పెషల్ బ్రాంచ్‌కు వెళ్లనున్నారు. ఏసీపీగా చేతన్ నితిన్ రెండు నెలల పాటు విధులు నిర్వర్తించనున్నట్లు తెలుస్తోంది.

ఎంజీఎంను పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మోహన్‌సింగ్

వరంగల్ మెడికల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలోని అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మోహన్‌సింగ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ జ్వరాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు సేకరించాలన్నారు. చలికాలం నేపథ్యంలో వృద్ధులు, పిల్లల పట్ల జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ నర్మద, ఏఎన్ఎం సులోచన, రాము, రాజేష్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులతో మేలు



సదస్సులో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఉమ్మారెడ్డి

జఫర్‌గఢ్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంలో సాంకేతిక పద్ధతులతో పంటల సాగుతో ఖర్చు తగ్గి, దిగుమతి పెరిగి రైతుకు ఎంతో మేలు జరుగుతుందని వ్యవసాయ పరిశోధన సంచాలకులు, శాస్త్రవేత్త డాక్టర్ ఉమ్మారెడ్డి అన్నారు. సోమవారం రఘునాథ్‌పల్లిలో డ్రోన్ ద్వారా వరి విత్తనాలు విత్తే పద్ధతిపై ప్రయోగాత్మకంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. ఉమ్మారెడ్డి మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం విప్లవాత్మక మార్పులు, సంస్కరణలు రాబోతున్నాయన్నారు. పంటల సాగు, ఉత్పత్తిలో డ్రోన్‌ల వినియోగం పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రధాన శాస్త్రవేత్త, డ్రోన్స్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్ఆర్‌జి.వర్మ మాట్లాడుతూ యువ రైతులకు డ్రోన్స్ అకాడమి ద్వారా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమావేశంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్‌కుమార్, దిలీప్‌కుమార్, ఓంప్రకాశ్, ఏఈఓ అపూర్వ, రైతు ప్రతినిధులు బొమ్మినేని పెద్దిరెడ్డి, రాగి ఎల్లారెడ్డి, గోపు సోమిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నర్సింహరెడ్డి, చల్లా సమ్మయ్య, వెంకటయ్య, పత్తిపాక కృష్ణారెడ్డి, చంద్రయ్య పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో రాణించిన కావ్యకు సన్మానం



కావ్యకు మెడల్, ప్రశంసా పత్రాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీకాంత్

జఫర్‌గఢ్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో జఫర్‌గఢ్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలకు చెందిన కె.కావ్య ఉత్తమ ప్రతిభను చాటింది. కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న కావ్య ఇటీవల హనుమకొండలో జరిగిన అండర్-19 బాలికల విభాగంలో బాక్సింగ్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. సోమవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీకాంత్, పీఈటీలు బి.రాజు, ఏ.శ్రీనాథ్, ఉపాధ్యాయ బృందం అభినందించి పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. మరింత పట్టుదల, ప్రతిభతో రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు.

నారాయణపురం పట్టాల జారీకి ఎమ్మెల్యే చొరవ



నారాయణపురంలో మంత్రి రేవంత్‌రెడ్డి, పొంగులేటి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

కేసముద్రం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో పట్టాదారు పాస్‌పుస్తకాల జారీకి ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ చొరవతో మార్గం సుగమమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఇటీవలె అసెంబ్లీలో నారాయణపురం రైతుల సమస్యను ప్రత్యేకంగా ప్రస్తావించి సమస్య పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ఈమేరకు సోమవారం ప్రస్తుత ధరణి పోర్టల్‌లో రైతుపేరు, తండ్రి పేరు 'అడవి'గా ఉన్న 256 పాస్‌పుస్తకాల రికార్డుల్లో అడవి పేరు తొలగించారని, మరో 30 రాత్రి వరకు పూర్తవుతాయని తెలిపారు. త్వరలోనే భూభారతి పోర్టల్ ద్వారా రైతులందరికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ అవుతాయని తెలిపారు. తాను అడిగిన వెంటనే సమస్య పరిష్కారానికి చొరవ చూపిన సీఎం రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ధరణిలో రైతుపేరు, తండ్రిపేరు 'అడవి' పదం తొలగిపోవడంతో పట్టాదారు పాస్‌పుస్తకాలకు మార్గం సుగమమైందని ఈ మేరకు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చిత్రపటానికి ఆ గ్రామ రైతులు పాలాభిషేకం చేశారు. సచివాలయం ముట్టడికి వెళ్లిన సమయంలో మంత్రి ప్రత్యేకంగా తమను పిలిపించి సమస్యను తెలుసుకొని పరిష్కారం దిశగా చర్యలు తీసుకున్నాడని మాజీ ఎంపీటీసీ ధరావత్ రవి తెలిపారు. త్వరలో తమకు పాస్ పుస్తకాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

గిరిజనుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



గిరిజన దర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న పీవో చిత్రామిశ్రా

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గిరిజన దర్బార్‌లో గిరిజనులు ఇచ్చే వినతులపై దృష్టిపెట్టి, వారి సమస్యలను సెక్టోరియల్ అధికారులు సత్వరంగా పరిష్కరించాలని ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం జరిగిన గిరిజన దర్బార్‌లో గిరిజనుల వద్ద నుంచి ఆమె వినతులు స్వీకరించారు. దర్బార్‌లో మొత్తం 18 మంది తమ వినతులు సమర్పించారు. గిరివికాసం పథకం ద్వారా పొలంలో బోరు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని వాజేడు మండలం చెరుకూరుకు చెందిన గడ్డమీద సాంబయ్య పీవోకు వినతి పత్రం అందించారు. గ్రామంలోని సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసి రోడ్ల నిర్మాణం చేపట్టాలని మంగపేట మండలం రాజుపేట వాసులు సుశీల తదితరులు విన్నవించారు. ఏదైనా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పీఈటీగా ఉద్యోగావకాశం కల్పించాలని తాడ్వాయి మండలం వీరాపురానికి చెందిన ఊకె వసంత విజ్ఞప్తి చేశారు. ఏటూరునాగారం ఐటీడీఏలో దివ్యాంగులకోసం ప్రత్యేక బ్లాక్‌ను ఏర్పాటు చేయాలని పూజారి మాణిక్యం వినతిపత్రం అందించారు. ఏటూరునాగారం మండలం ఆకులవారిఘణపురంలోని కొమురంభీం కాలనీలో సోలార్ విద్యుత్తు లైట్లను అమర్చాలని వంక నరేష్ పీవోను కోరారు. ఈ కార్యక్రమంలో ఏవో రాజ్‌కుమార్, ఎస్‌వో సురేష్‌బాబు, జేడీఎం కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీసెట్ ఫేజ్-3 వెబ్ ఆప్షన్లు ఎంపిక చేసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : డీసెట్-2024లో అర్హత సాధించి ఫేజ్-1, 2లలో వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకోని అభ్యర్థులు జనవరి 2 నుంచి 4వ తేదీ వరకు ఎంపిక చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి. అబ్దుల్ హై సోమవారం ప్రకటనలో కోరారు. 9న సీట్ల కేటాయింపు ఉంటుందని, 13 లోపు ఫీజు చెల్లించి ఫైనల్ అడ్మిషన్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకొని 16న సంబంధిత కళాశాలలో రిపోర్టు చేయాలని ఆయన సూచించారు.

ప్రాన్ నెంబర్లు కేటాయించాలి : యూటీఎఫ్

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో ఎంపికై ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన కొత్త ఉపాధ్యాయులందరికీ ప్రాన్ నెంబర్లు కేటాయించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నామోజు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు జిల్లా ఖజానా అధికారికి వినతి పత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. 45 రోజులు దాటినా కొత్త ఉపాధ్యాయులకు ప్రాన్ నెంబర్లు కేటాయించకపోవడంతో సకాలంతో వేతనాలు అందడం లేదని పేర్కొన్నారు. అధికారులు వెంటనే ప్రాన్ నెంబర్లు కేటాయించాలని కోరారు.

వార్డెన్‌ను తొలగించాలని విద్యార్థినుల ధర్నా



మోడల్ స్కూల్ గేట్ ముందు ధర్నా చేస్తున్న విద్యార్థినులు

నర్మెట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లోని హాస్టల్ వార్డెన్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ మోడల్ స్కూల్ విద్యార్థినులు స్కూల్ గేట్ వద్ద సోమవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. విద్యార్థినులు మాట్లాడుతూ వార్డెన్ సునీత తమను ఇబ్బందులకు గురి చేస్తోందని, వాటర్ క్యాన్‌లను తమతో మోయిస్తుందని, ఆదివారం హాస్టల్‌ను శుభ్రం చేయిస్తోందని ఆరోపించారు. విద్యార్థినులను కులం పేరుతో దూషిస్తుందని, హాస్టల్‌కు రాని వారికి హాజరు వేస్తూ, వచ్చిన వారికి అబ్సెంట్ వేస్తోందన్నారు. విషయం తెలుసుకున్న నర్మెట సీఐ అబ్బయ్య, ఎస్‌వో రజిత మోడల్‌స్కూల్‌కు వార్డెన్‌పై అధికారులు ఫిర్యాదు చేసి విచారణ చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో విద్యార్థినులు సుప్రియ, అర్చన, అఖిల, స్వర్ణ, పవిత్ర, సాత్విక, సిరిచందన, శ్రీలత, నవ్య, సింధు, మహేశ్వరి పాల్గొన్నారు.

బొల్లెపల్లి పోడు భూముల్లో డీఎఫ్‌వో పర్యటన



మండలంలోని బొల్లెపల్లి పోడు భూముల్లో డీఎఫ్‌వో విశాల్‌తో మాట్లాడుతున్న సీఐ బాబురావు

గూడూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గూడూరు మండలం బొల్లెపల్లి గ్రామంలోని పోడు భూముల్లో మహబూబాబాద్ డీఎఫ్‌వో బత్తుల విశాల్ సోమవారం అకస్మీకంగా పర్యటించారు. బొల్లెపల్లి పోడు భూముల్లో ఓ గిరిజన రైతు వ్యవసాయ బావి తీసుకోగా మహబూబాబాద్ రేంజ్ అటవీశాఖ అధికారులు అభ్యంతరం తెలిపారు. సదరు పోడు రైతు తీసిన బావిని పూడ్చేందుకు అటవీశాఖ సిబ్బంది సన్నద్ధమైనట్లు సమాచారం. ఈ విషయంపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు మహబూబాబాద్ డీఎఫ్‌వో బత్తుల విశాల్ బొల్లెపల్లి పోడు భూముల్లో పర్యటించారు. సదరు రైతు, గ్రామస్తులు పోడు భూమికి హక్కు పత్రం కలిగి ఉండడం వల్లనే తాను వ్యవసాయ సాగు కోసం బావి తీయించుకున్నట్లు చెప్పారు. గ్రామస్తులు ఏకమై అధికారులతో చర్చించారు. రాత్రి సమయం కావడంతో గూడూరు సీఐ కలుగజేసుకుని ఈ సమస్యను సామరస్యంగా అటవీశాఖ, గ్రామస్తులు పరిష్కరించుకోవాలని డీఎఫ్‌వో దృష్టికి తీసుకువెళ్లారు. సదరురైతుకు సంబంధించిన హక్కు పత్రాలతో సంబంధిత పోడు రైతులంతా మహబూబాబాద్ డీఎఫ్‌వో కార్యాలయానికి వచ్చి సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా రైతులకు సూచించారు. ఆయన వెంట మహబూబాబాద్ రేంజ్ అధికారి జ్యోత్స్నదేవి, గూడూరు ఎస్సై గిరిధర్‌రెడ్డి, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్టీలను రెగ్యులర్ చేయాలి

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌రెడ్డి



ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్టీలను ఉద్దేశించి మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాకేష్‌రెడ్డి

ఏటూరునాగారం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఎనిమిది రోజులుగా కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న నిరసన శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో సీఆర్టీలకు నెలకు రూ. వేల నుంచి రూ. 29 వేల వరకు వేతనం పెంచామని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం అదనపు పనులు చేయించుకుంటూ శ్రమను దోచుకుంటోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌ను అధికారంలోని తీసుకొస్తే ఉపాధ్యాయుల, నిరుద్యోగుల తలరాతలు మారుస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి నేడు తలదించుకుంటున్నాడని విమర్శించారు. సీఆర్టీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు బీఆర్ఎస్ వారికి అండగా ఉంటోందని అన్నారు. అంతేకాకుండా గత 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, ప్రతి నెల మొదటి తేదీన జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులను మహిళా ఉపాధ్యాయులకు అందించాలని, కాంట్రాక్టు ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులను మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ములుగు నియోజకవర్గ నాయకులు భూక్య జంపన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సునీల్, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.ఖాజాపాషా, సీనియర్ నాయకులు కావిరి చిన్నకృష్ణ, కాళ్ల రామకృష్ణ, బోజారావు, సప్పిడి రామనర్సయ్య, మండపల్లి సాగర్ తోపాటు సుమారు 40 మంది సీఆర్టీలు పాల్గొన్నారు.

హైవేపై విద్యుత్ సరఫరా నిలిపివేత

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కరెంట్ బిల్ కట్టలేదని జాతీయ రహదారిపై విద్యుత్ అధికారులు సోమవారం కరెంట్ సరఫరా నిలిపివేశారు. ఛాగల్ గ్రామం వద్ద నుంచి మండల కేంద్రంలోని వేణు దాబా హోటల్ వరకు సుమారు 6కిలో మీటర్ల దూరం మేర లైట్లు వెలగకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ ఏఈ పి.శంకర్ మాట్లాడుతూ హైవే లైట్లకు సంబంధించిన కరెంట్ బిల్లు రూ.7లక్షల పెండింగ్ ఉందన్నారు. డిసెంబరు 19 వరకే ఎల్అండ్‌టీ సంస్థ బిల్లు చెల్లించాల్సి ఉండగా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. బిల్లు చెల్లించకపోవడంతో హైవే పైన విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు తెలిపారు. డీఈఈ రాంబాబు ఆదేశాల మేరకు ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సరఫరాను పునరుద్ధరించామన్నారు.

ఆన్‌లైన్‌లో ప్రకటనతో మోసపోయిన యువకుడు

కొడకండ్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మోసానికి మరో వ్యక్తి బలయ్యాడు. రూ.7లక్షలు మోసపోయి లబోదిబోమంటున్నాడు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. హక్యాతండాకు చెందిన యువకుడు గుగులోత్ అశోక్ ఫేస్‌బుక్‌లో కనబడిన ఫెర్టిలైజర్స్ ఇండియా డీలర్‌షిప్ కోసం అందులో ఇచ్చిన ఫోన్ నెంబర్‌కు కాల్‌చేసి తన పూర్తి వివరాలు ఇచ్చాడు. తర్వాత ఆ ఫోన్ నెంబర్‌కు పలు దఫాలుగా మొత్తం రూ.7లక్షల ఫోన్‌పే ద్వారా పంపించాడు. షాప్ ప్రారంభించినప్పుడు స్టాక్ ఇస్తామని చెప్పి ఇప్పుడు ఆ ఫోన్ నెంబర్లలో ఎలాంటి స్పందన లేకపోవడంతో తాను మోసపోయానని లబోదిబోమంటున్నాడు. సోమవారం అశోక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఢిల్లీలో కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించిన కవిత్వ సమ్మేళనంలో మహేందర్ (ఫైల్)

దివ్యాంగుల గొంతుకై..

హక్కులు, ఆత్మగౌరవం కోసం శ్రమిస్తున్న మహేందర్

కోమటిపల్లి తండాలో ఉపాధ్యాయుడిగా విధులు

హసన్‌పర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆయన వర్ధమాన తెలుగు సాహితీవేత్త. సమాజ సేవకుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, సంపాదకుడు, ప్రచురణకర్త, విద్యా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, దివ్యాంగుల సామాజిక వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ రచయితల సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తున్న ఓ సాధారణ కుటుంబానికి చెందిన దివ్యాంగుడు. ఓ వైపు తన ఉపాధ్యాయ వృత్తిని కొనసాగిస్తూనే దివ్యాంగుల హక్కులు, ఆత్మగౌరవం కోసం వారి గొంతుకై.. తన రచనల ద్వారా మార్పు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు. దివ్యాంగుల హక్కుల కార్యకర్తగా ఆయన చేస్తున్న కృషిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అవార్డులు ఇచ్చి సత్కరించింది. ఆయనే బిల్ల మహేందర్. వేలేరు గ్రామంలో జయ, రాజమౌళి దంపతులకు జన్మించిన ఆయన హసన్‌పర్తి మండలం కోమటిపల్లి తండాలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం హనుమకొండ టీఎన్‌జీవోస్ కాలనీ ఫేజ్-2 నివసిస్తున్నారు. ఆయన పుట్టుకతోనే పోలియో కారణంగా అంగవైకల్యానికి గురైనా ఆత్మవిశ్వాసంతో అంచెలంచెలుగా ఎదిగి అందరికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

సాహితీ సేవలో సామాన్యుడు

'కాళ్లు లేకపోవచ్చు..! ఉన్నా వంకర తిరిగో, వేళ్లు ముడుచుకొని పోయో ఉండొచ్చు.. కదలికైతే ఉంది కదా.. చేతులు లేకపోవచ్చు. ఉన్నా కండలేక బక్కచిక్కి మొండిపోయే ఉండొచ్చు. ఓ రూపాన్ని అయితే మలుస్తున్నాయి కదా. ఒరేయ్ నాన్న. మనిషంటే కళ్లు, కాళ్లు, చెవులు, నోరు, చేతులే కాదురా. మనస్సు కూడా' అంటూ దివ్యాంగులపై కవిత్వం రాసిన గొప్ప రచయిత. 'పిడికెడు మట్టిని తీసుకురండి. మొలకెత్తడం నేర్చుకుందాం. వస్తూ ఉన్నప్పుడు ఓ అనాథ ముంగిళిని ముద్దాడండి. ఇక ఎలాగైనా బతికేయొచ్చు' అంటూ అనాథలపై ప్రేమ కురిపించిన ప్రేమికుడు. 'ఇప్పుడు నాకొక కవిత కావాలి. చీకటి తెరలను చీల్చుకుంటూ పొద్దున్నే మొలిచే సూర్యుడు లాంటి కవితొకటి కావాలి. ఇప్పుడు నాకొక పాట కావాలి. భుజమ్మీద తుపాకీ మొనలోంచి దొరల గుండెల్లో సూటిగా దూసుకెళ్లే తూటాలాంటి సాయుధ పాటొకటి కావాలి' అంటూ ధిక్కార పతాకాన్ని ఎగరేసిన శైలి ఆయన సొంతం. మలిదశ తెలంగాణ ఉద్యమానికి ప్రభావితమైన మహేందర్ ఇప్పటి వరకు 11 పుస్తకాలను రాశారు. ఉద్యమ సందర్భంలో పోరుగానం, పిడికిలి కవితా సంపుటాలను రచించి ఉద్యమానికి అందించారు. దివ్యాంగులలో ఆత్మస్థైర్యం నింపే ప్రయత్నంలో భాగంగా కాలాన్ని గెలుస్తూ, గెలుపు చిరునామా లాంటి ప్రత్యేక ప్రతిభావంతులపై కవిత్వ పుస్తకాలు అచ్చువేసి తెలుగులో భిన్నమైన సాహిత్యానికి బీజం నాటారు. తాను రాసిన కొన్ని ప్రశ్నలు కొన్ని జ్ఞాపకాలు, ఇప్పుడొక పాట కావాలి, తను నేను వాక్యం లాంటి కవిత్వ సంపుటాలు మహేందర్‌ను మంచి కవిగా తెలుగు సాహిత్యంలో నిలబెట్టాయి. తన సంపాదకత్వంలో కొవిడ్-19, వలస దుఃఖం, బిల్కిస్ బానోపై సంఘీభావ కవిత్వం లాంటి సమకాలిన అంశాలపై సంకలనాలు తీసుకొచ్చి సాహిత్యంలో నిరంతర కృషి చేస్తూనే పలు


మహేందర్ రచనలు

ఎన్నో రచనలు, కవితలతో మార్పు కోసం తపన

విద్య ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు

ఆదర్శం

సామాజిక, సాంస్కృతిక ఉద్యమాలలో తనవంతు చురుకైన పాత్రను కొనసాగిస్తూ ఓరుగల్లు కవులకు తలలో నాలుకలా ఉంటున్నారు.

విద్య ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవ..

విద్య ద్వారానే సమానత్వం సాధ్యమన్న అంబేద్కర్ మాటను స్ఫూర్తిగా తీసుకొని, ప్రార్థించే పెదాల కన్నా సహాయం చేసే చేతులే మిన్న అన్న మదర్ థెరిస్సా సూక్తిని తనలో నింపుకొని కలిసి వచ్చిన మిత్రుల సహకారంతో 2014లో అంబేద్కర్ జన్మదినమైన ఏప్రిల్ 14న విద్య ఫౌండేషన్ అనే సంస్థను స్థాపించారు మహేందర్. ఆ సంస్థ ద్వారా వికలాంగ, అనాథ, నిరుపేద విద్యార్థులకు తగిన చేయూతనిస్తూ వారిలో ఆత్మస్థైర్యం నింపే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2019లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో దివ్యాంగుల సాంస్కృతికోత్సవం పేరుతో వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో రాష్ట్ర స్థాయి దివ్యాంగ కళాకారులచే అద్భుతమైన ప్రదర్శన ఏర్పాటు చేసి వారిలో చైతన్యం నింపాడు. నిరుపేద విద్యార్థులను ఫౌండేషన్ ద్వారా దత్తత తీసుకొని చదువు కొనసాగించేవిధంగా కృషి చేస్తున్నాడు. 2021లో కోవిడ్ సమయంలో మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బడితండాలో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.1.50లక్షలతో ఇంటిని నిర్మించి నాటి కలెక్టర్ పి.గౌతమ్ చేతుల మీదుగా గృహప్రవేశం చేయించారు.

దివ్యాంగుల హక్కుల కార్యకర్తగా ..

మహేందర్ గతంలో వికలాంగుల హక్కుల పోరాట సమితిలో సభ్యుడిగా ఉంటూ దానికి అనుబంధంగా ఏర్పడిన ఫిజికల్లీ చాలెంజ్డ్ టీచర్స్ యూనియన్ వరంగల్ జిల్లా వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా సేవలందించాడు. ప్రస్తుతం డిఫరెంట్లీ ఏబుల్డ్ ఎంప్లాయీస్ వేల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తూ దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారు. దశాబ్దన్నర కాలంగా దివ్యాంగుల హక్కులు, ఆత్మగౌరవం కోసం కృషి చేస్తూ పలు సమస్యల పట్ల స్పందిస్తూనే సాహిత్యపరంగా దివ్యాంగుల అస్తిత్వం కోసం రచనలు చేస్తూ పుస్తకాలను ప్రచురిస్తున్నారు. సుబేదారిలోని ప్రభుత్వ దివ్యాంగుల బాలికల అవస్థను గమనించిన మహేందర్ అప్పటి ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి వసతి గృహానికి రోడ్డు వేయించడంలో విశేష కృషి చేశారు. 2021లో రెండు తెలుగు రాష్ట్రాల్లోని దివ్యాంగ మేధావులు, ఉద్యమకారులతో సమాలోచన జరిపి దివ్యాంగుల సామాజిక వేదిక అనే సంస్థను స్థాపించి దాని ద్వారా దివ్యాంగులకు సంబంధించిన సమాచారాన్ని అందజేయడంతో పాటు పలు దివ్యాంగ అంశాలపై అవగాహన కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. అదేవిధంగా ఇదే వేదిక ద్వారా కవిత్వం, వ్యక్తిత్వ వికాసం, విజేత, కళలు, ఇంటర్వ్యూ ద్వారా దివ్యాంగులలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించే దిశగా అడుగులు వేస్తూ వారి అస్తిత్వం కోసం కృషి చేస్తున్నారు. అలాగే ఇంకెన్నో సామాజిక ఉద్యమాల్లో పాల్గొంటూ చైతన్యవంతమై కార్యక్రమాలు నిర్వహిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు.


విద్య ఫౌండేషన్ విద్యార్థులతో మహేందర్

అందుకున్న అవార్డులు...

మహేందర్ చేసిన సాహితీ కృషికి గాను బొవేరా సాహితీ పురస్కా



రాష్ట్ర ప్రభుత్వం నుంచి బెస్ట్ రోల్ మోడల్ అవార్డు అందుకుంటున్న మహేందర్ (ఫైల్)

రం-2015, డాక్టర్ ద్వానా శాస్త్రి కవితా పురస్కారం, కాళోజీ పురస్కారం-2019 (తెలంగాణ రచయితల సంఘం, కరీంనగర్), బీఎస్.రాములు స్ఫూర్తి పురస్కారం-2019, డాక్టర్ రాదేయ కవితా పురస్కారం-2020, కవి సంగమం రొట్టె మాకు రేపు అవార్డు-2022 తదితర రాష్ట్ర స్థాయి పురస్కారాలతో పాటు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, మహాత్మా జ్యోతిరావు పూలే అవార్డు లాంటి ఎన్నో పురస్కారాలను అందుకున్నారు. దివ్యాంగుల సాధికారత కోసం కృషి చేస్తున్నందుకు గాను 2022వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం డిసెంబరు 3న అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బెస్ట్ రోల్ మోడల్ కేటగిరీలో అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే 2023లో కేంద్ర సాహిత్య అకాడమీ ఆహ్వానం మేరకు ఢిల్లీలో జరిగిన ఆల్ ఇండియా డిఫరెంట్లీ ఏబుల్డ్ రైటర్స్ మీట్‌లో తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొని తెలుగు భాష నుంచి కవిత్వాన్ని వినిపించారు.

గవర్నర్ నుంచి అవార్డును అందుకుంటున్న మహేందర్ (ఫైల్)



కళ

సబ్బు బిళ్లే ఆయన కాన్వాస్

- కమనీయ చిత్రాల రూపకల్పనలో నేర్పరి
- ప్రముఖుల ప్రశంసలు అందుకున్న గోకా రామస్వామి


గోకా రామస్వామి

నర్సంపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆయనకు సబ్బు బిళ్లలే కాన్వాస్‌లు. అవి ఆయన చేతికి దొరికాయంటే చాలు అద్భుత కళాఖండాలు రూపుదిద్దుకున్నట్టే. రవీంద్రనాథ్ ఠాగూర్, జాతిపిత మహాత్మా గాంధీ, చాచా నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, మాజీ ప్రధానులు వాజ్‌పేయి, ఐకె గుజ్రాల్, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ ఇలా ఎందరో వ్యక్తుల చిత్రాలను ఆయన సబ్బు బిళ్లలపై చెక్కి ఔరా అనిపించారు. అంతేకాదు శివుడు, నంది, విఘ్నేశ్వరుడు, కళశంతో పాటు మరెన్నో ప్రకృతి రమణీయ సుందర దృశ్యాలను కూడా చిత్రీకరించారు. చిన్న బ్లేడు ముక్కసాయంతో సబ్బుబిళ్లలపై అద్భుతాలు గీస్తున్నారు గోకారామస్వామి. చాక్ పీసులపై కూడా శిల్పాలు, వివిధ బొమ్మలు చెక్కడంలో నేర్పరి అయిన ఆయనకు చిన్నతనంలో కాగితాలపై చిత్రాలు గీయడం అలవాటు కాగా.. క్రమంగా సబ్బు బిళ్లలపై శిల్పాలు చిత్రించే నైపుణ్యాన్ని పెంచుకున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి చిత్రకళా ప్రదర్శనల్లో గోకా రామస్వామి పాల్గొని ప్రదర్శించిన సబ్బు బిళ్లలపై చెక్కిన చిత్రాలకు బహుమతులు లభించాయి. రామస్వామి ఇప్పటివరకు రెండు వేలకు పైగా వివిధ రకాల చిత్రాలను సబ్బు బిళ్లలపై చిత్రీకరించారు. గతంలో మాజీ ప్రధాని వాజ్‌పేయి, ఐకె గుజ్రాల్ చిత్రాలను చిత్రించి స్వయంగా వారికి అందించి ప్రశంసలను అందుకున్నారు. 'అగ్గిపుల్ల... సబ్బు బిళ్ల.. కాదేదీ కళకు అనర్హం' అన్న శ్రీశ్రీ సూక్తిని స్ఫూర్తిగా తీసుకొని శిల్పాలు చెక్కుతూనే.. తనకు వచ్చిన ఈ కళను పది మందికి నేర్పాలి, చేరవేయాలన్న లక్ష్యంతో చిత్రకళా పోటీలు, ప్రదర్శనలు నిర్వహించారు. గతంలో బాలల చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించి బాల బాలికలకు బహుమతులు అందజేశారు. వివిధ సామాజిక సేవాకార్య క్రమాలు నిర్వహించి మొక్కలు నాటే కార్యక్రమాలతో పాటు మొక్కలు పెంపకం కార్యక్రమాలు చేపట్టారు. 2002లో అటవీ శాఖ నుంచి వన ప్రేమికుడి అవార్డును అందుకున్నారు. గతంలో జాతీయ స్థాయిలో లైఫ్-లింక్ స్వీడన్‌వారి ప్రశంసాపత్రంతో పాటు జాతీయస్థాయిలో యునెస్కో అవార్డును అందుకున్నారు.


సబ్బు బిళ్లపై దేశ ప్రధాని నరేంద్ర మోదీ చిత్రం, గణపతి


అబ్దుల్ కలాం | శంకరుడు

అనుమతులు లేకపోతే చర్యలు తప్పవు

- నేడు అర్ధరాత్రి ఒంటిగంట వరకు మద్యం విక్రయాలు
- ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ అంజిత్ రావు

ఫటాఫట్


డీసీ అంజిత్‌రావు

ఆంధ్రజ్యోతి : న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో మీరు తీసుకుంటున్న చర్యలు?

డీసీ : న్యూఇయర్ వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి ఒంటి గంట వరకు మద్యం విక్రయాలకు అనుమతులిచ్చాం. మద్యం విందులు జరుపుకునేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే వెంటనే అనుమతులు ఇస్తాం. కమర్షియల్ అయితే రూ.50వేలు, కమర్షియల్ కాకపోతే రూ.9,వేలు చెల్లించాలి. అనుమతులు తీసుకోకుండా విందులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : ఉమ్మడి జిల్లాలో వైన్స్, బార్లపై పర్యవేక్షణ ఎలా ఉంది?

డీసీ : ఉమ్మడి జిల్లాలోని 17పోలీస్‌స్టేషన్ల పరిధిలో 294 వైన్ షాపులు, 130 వరకు బార్ అండ్ రెస్టారెంట్లున్నాయి. నెలనెలా ఆయా జిల్లాల పరిధిలోని ఎక్సైజ్ సీఐలు షాపుల్లోని స్టాక్ రిజిస్టర్ పరిశీలించి, మద్యం కల్తీపై పరీక్షలు జరిపి. వేళలు పాటించని షాపుల వివరాలను ఎక్సైజ్ సూపరింటెండెంట్లకు అందిస్తారు. నిబంధనలు ఉల్లంఘించే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటారు.

ఆంధ్రజ్యోతి : గంజాయి నియంత్రణ, ఎన్‌డీపీఎల్ మద్యం విషయంలో వస్తున్న విమర్శలు గురించి?

డీసీ : ఐదారు మండలాలు కలిపి ఒక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండడంతో నియంత్రించలేకపోతున్నామనేది కొంత వాస్తవమే అయినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఇప్పటి వరకు 20 మందిని అరెస్టు చేసి 17 కేసులు నమోదు చేశాం. ఎన్‌డీపీఎల్ మద్యం అనేది వరంగల్ డివిజన్‌లో పూర్తిగా తగ్గిపోయింది వాటి కేసులు నిల్.

ఆంధ్రజ్యోతి : బెల్ట్‌షాపులు, అనుమతుల్లేకుండా సిట్టింగ్ రూమ్‌ల నిర్వహణపై చర్యలు తీసుకుంటున్నారా?

డీసీ : బెల్ట్‌షాపుల నిర్వహణపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటాం. మండలాల్లోని వైన్స్‌షాపుల్లో నిబంధనల ప్రకారం సిట్టింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలి. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి : గుడుంబా, బెల్లం విక్రయాల నియంత్రణ గురించి మీరేమంటారు?

డీసీ : గ్రేటర్‌లో పూర్తిగా తగ్గిపోయింది. ఇక్కడ పీడీ యాక్టు పెట్టి నిలువరించగలిగాం. మహబూబాబాద్, వరంగల్, భూపాలపల్లి జిల్లాలో కొంత నడుస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు 4577 మందిని అరెస్టు చేశాం. 1066 వాహనాలను సీజ్ చేశాం. డ్రైండ్రైవ్ ఉల్లంఘించిన 197మందితో రూ. 50లక్షలు జరిమానా వసూలు చేయించాం.

- వరంగల్ క్రైం, ఆంధ్రజ్యోతి

అట్టహాసంగా ముగిసిన నాటకోత్సవాలు

ఓరుగల్లు చరిత్రను చాటి చెప్పిన కళాకారులు

హసన్‌పర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు సోమవారం అట్టహాసంగా ముగిశాయి. తెలంగాణ రాష్ట్ర భాష సాంస్కృతిక శాఖ, సంగీత నాటక అకాడమీ, చలనచిత్ర అభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో చివరి రోజున వనం లక్ష్మీకాంతరావు సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తడకమ్మల రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రముఖ బుర్ర కథ కళాకారుడు, రంగస్థలం నటుడు, హనుమకొండ జిల్లా నాటక సమాజాల అధ్యక్షుడు డాక్టర్ ఓడపల్లి చక్రపాణి, యోగా గురువు బండారి సుభాష్‌లను నాటకోత్సవాల కమిటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కాకతీయ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు రాజారపు సంజీవరెడ్డి ఆధ్వర్యంలో పారితోషక దాత ఓడపల్లి చక్రపాణి సమక్షంలో తడకమళ్ల రాంచందర్‌రావు దర్శకత్వంలో సురభి కొండల్‌రావు సంగీతంలో మహారాణి నిర్వహించిన రుద్రమదేవి చారిత్రాత్మక పద్యనాటకం ఆహూతులను ఆకట్టుకుంది. కాజీపేట తిరుమలయ్య వాఖ్యానకర్తగా వ్యవహరించగా అటికం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఆటికం రవీందర్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం కళాకారులకు భోజన వసతి కల్పించగా అకుల సదానందం టెంట్ సమకూర్చగా అకుల సునీల్ కళాకారులకు జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం, కళాకారులు గూడూరు బాలాజీ, సురభిహారిక, మాడిశెట్టి రమేష్, సీతవెంకటేశ్వర్లు, వనపర్తి ప్రసాద్, మాలి విజయరాజ్, నాగరాజు, రామదాసు, రవీందర్, ముండ్రాతి రవీందర్, శివసాయి కళామండలి ఎలుకుర్తి హవేలి కళాకారులు, మనోహర్ రావు, సాదు శ్యాంప్రసాద్, నిభానిపొడి సుబ్బరాజు, రాజమౌళి, డివిజన్ నాయకులు రాయికంటి సురేష్, ఏనుగు శివాజీనాయుడు, కవులు, కళాకారులు, కళాభిమానులు, పాల్గొన్నారు.


ముగింపు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ రవీందర్‌రావు



కేటీఆర్‌తో ఎమ్మెల్సీ రవీందర్ రావు, రాంమోహన్‌రెడ్డి

మహబూబాబాద్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను సోమవారం ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కలుసుకున్నారు. రాష్ట్ర, జిల్లా రాజకీయాలపై చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాల్లో విజయకేతనం ఎగురవేసేలా పార్టీని మరింత పటిష్ఠ పర్చాలని కేటీఆర్ సూచించినట్లు ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీం దర్‌రావు తెలిపారు. అదే విధంగా లగచర్ల గిరిజన రైతులకు మద్దతుగా మహబూబాబాద్‌లో నిర్వహించిన సభ విజయ వంతం కావడంపట్ల బీఆర్‌ఎస్ నేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ తరగతులతో మేలు : డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 15 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో ఈ ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో 20 రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని, కేజీబీవీల్లో రాత్రి వేళల్లో మహిళా కానిస్టేబుళ్లతో భద్రత ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ డైరెక్టరేట్ నుంచి విద్యార్థులకు ఆన్‌లైన్ తరగతులు ప్రారంభించినట్లు తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల బోధనకు ఇబ్బంది లేకుండా ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 29 నుంచి అన్ని కేజీబీవీల్లో రిసోర్స్ పర్సన్స్, బీ.ఎడ్ విద్యార్థుల ద్వారా విద్యనందించడం జరుగుతుందన్నారు. కుకింగ్ సిబ్బంది కూడా సమ్మెలో పాల్గొంటే బాలికలకు భోజనం, అల్పాహారం అందించడం కష్టమవుతుందని, అవసరమైతే ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వంట చేసే వంట ఏజెన్సీని వంటలు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



కేజీబీవీలో ఆల్ ఇన్ వన్ పుస్తకాలను అందజేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

● దంతాలపల్లి, (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఇష్టంతో చదివి రాణించాలని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఆత్మవిశ్వాసంతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు రూ. 30 వేల విలువైన స్టడీ మెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీదేవి, హెచ్‌ఎం వేణుమాధవ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● కేసముద్రం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మహమూద్‌పట్నం కేజీబీవీలో సోమవారం లయన్స్‌క్లబ్ కార్యదర్శి రావుల నవీన్‌రెడ్డి కుమారుడు అభయ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా 35 మంది పదో తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్‌లను డీఈవో రవీందర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం చంద్రశేఖర్, మాజీ అధ్యక్షుడు బెజ్జం ప్రేమ్‌కుమార్, లక్కాకుల సత్యనారాయణ, పరాంకుశం శ్రీహరి, చింతా కరుణాకర్, మారం సమ్మిరెడ్డి పాల్గొన్నారు.

పులి తిరుగుతోంది.. అప్రమత్తంగా ఉండండి

ఎఫ్‌ఆర్వో వజాహత్



పులి అడుగు జాడలను గుర్తిస్తున్న ఎఫ్‌ఆర్వో వజాహత్

కొత్తగూడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ మండలంలో పెద్దపులి తిరుగుతుంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్‌ఆర్వో వజాహత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా వజాహత్ మాట్లాడుతూ మండలంలోని పలుగ్రామాల్లో పులి తిరుగుతున్నట్టు ప్రచారం జరుగతుందన్నారు. కాని కోనాపురంలో పులి అడుగులు గుర్తించామన్నారు, గ్రామాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువుల కాపరులు 10 రోజుల వరకు అడవులకు వెళ్ల వద్దన్నారు. రైతులు సాయంత్రం వరకు పనులు పూర్తి చేసుకుని ఇళ్లకు చేరాలని సూచించారు. కొత్తగూడ మండలంలో అటవీశాఖ అధికారులు అధికారులు గ్రూప్‌లుగా ఏర్పడి పులి సంచారాన్ని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. అడవుల్లో ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎక్కడైనా పులి అడుగులు కనిపిస్తే అటవీశాఖ అధికారు లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

టీయూడబ్ల్యూజే -143 అర్బన్ కమిటీ ఎన్నిక



మహబూబాబాద్‌లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టీయూడబ్ల్యూజే)-143 యూనియన్ మానుకోట అర్బన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహబూబాబాద్ ఐఎంఏ హాల్‌లో సోమవారం సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఈరగాని భిక్షం, జిల్లా కన్వీనర్ మద్దినేని గుట్టయ్య, కో-కన్వీనర్ గాడిపెల్లి శేఖర్‌ల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హనుమాండ్ల రామకృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులుగా కిరణ్‌కుమార్, లక్ష్మణ్, వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా నల్లకుంట్ల కరుణాకర్, కోశాధికారిగా తప్పెట్ల రాజు, సహాయ కార్యదర్శులుగా రామచంద్రు, రాజ్‌కుమార్, శ్రీధర్, చక్రధర్, రమేష్, వెంకన్న, కమిటీ సభ్యులుగా సీతారాం, దేవేందర్, ఎమ్డీ. యాకూబ్, శ్రీను, కోమటి నవీన్, రంజిత్, మీడియా ఇన్‌చార్జీగా తేజావత్ శ్రీనివా స్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ బాధ్యులను శాలువాలతో సత్కరించారు.

ఘనంగా తిరుప్పావై వేడుకలు



గోదాదేవి-రంగనాథులకు పూజలు చేస్తున్న మహిళలు

మరిపెడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవంలో భాగంగా సోమవారం మరిపెడ బంగ్లాలోని రాములోరి గుడిలో తిరుప్పావై వేడుకలను భక్తులు నిర్వహించారు. ఆలయ అర్చకుడు సుదర్శన్‌భట్టార్ దేవతామూర్తులకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిపారు. అనంతరం గోదాదేవి -రంగనాథులకు భక్తులు పల్లకీ సేవ నిర్వహించి మంగళ హారతులు పట్టారు. గంట్లా రంగారెడ్డి, రామిని మధు, దిలీప్ పాల్గొన్నారు.

బీసీల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలు(బీసీ)ల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కాంగ్రెస్ జిల్లా నాయకులు శంతన్‌రామరాజు అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని శనిగపురంలో సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో మల్లికార్జున్, మల్లెష్, రవి, నరేష్, గోపాల్, శ్రీసాయి తదితరులు పాల్గొన్నారు.

మరింత.. సహకారం

(3వ పేజీ తరువాయి)

ఔషధాలను అందుబాటులో ఉంచడం, ఆరోగ్యపరమైన సమస్యలను పరిష్కరించేందుకు కార్పొరేట్ వైద్యుల ద్వారా ఆన్‌లైన్ సలహాలు, సూచనలు, రక్త నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణ కూడా అందేలా చూస్తారు. కామన్ సర్వీస్ సెంటర్లు, మీ సేవా కేంద్రాల ఏర్పాటుకు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు రుణ సహాయం చేస్తుంది.

సిబ్బందిలేక ఇబ్బందులు..

సంఘాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించకుండా ఇప్పటికే విధులు నిర్వహించే వారితో సేవలను అందించాలని నిర్ణయించడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. కంప్యూటర్ ఆపరేటర్లు, సీఈవోలకు శిక్షణ అందించినా పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడంతో కొందరు సీఈవోలు నిరాసక్తత చూపుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవు తున్నాయి. సేవలు పెంచితే ప్రస్తుతం ఉన్న సాంకేతిక పరిజ్ఞానం సరిపోతుందా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కోర్ బ్యాంకింగ్ ద్వారా రోజువారీ ఆన్‌లైన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మోడెం ద్వారా ఇవి జరుగుతున్నాయి. గ్రామాల్లోని చాలా సంఘాలకు సొంత భవనాలు లేవు. సొంత భవనాలు ఉన్న సంఘాల్లో కనీస సౌకర్యాలు లేవు. గ్రామాల్లో ప్రధానంగా ఇంటర్నెట్ సమస్య ఆన్‌లైన్ సేవలకు అడ్డంకి కానుంది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను బలోపేతం చేయడానికి కార్యాచరణను రూపొందిస్తున్నారు. ఇప్పటికే సంఘాల్లోని సిబ్బందికి శిక్షణ ఇచ్చి సీఎస్‌సీ సెంటర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పీఏసీఎస్‌ల ద్వారా డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడం వల్ల పల్లె ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఆన్‌లైన్ సేవల కోసం దూరప్రాంతాలకు వెళ్లే ఇబ్బందులు తప్పుతాయి.

ఎన్నికల హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

డోర్నకల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శెట్టి వెంకన్న అన్నారు. సోమవారం డోర్నకల్ మండల సీపీఎం పార్టీ సమావేశాన్ని మండల కమిటీ సభ్యులు అనగాని శ్రీనివాస్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బొమ్మన అశోక్‌కుమార్, సీపీఎం మండల కార్యదర్శి ఉప్పనపల్లి శ్రీనివాస్, సీఐటీయూ మండల కార్యదర్శి దాసరి మల్లేశం, ఎండి.నవాబ్, కొడవళ్ల సైదులు, గాదె నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు తప్పవు

గార్ల, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకల్లో యువత నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలతోపాటు కేసులు తప్పవని ఎస్సై ఎస్‌కే రీయాజ్ పాషా హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ మద్యం షాపులు, బెల్ట్‌షాపులపై ప్రత్యేకమై దృష్టి పెట్టినట్లు ఎస్ఐ తెలిపారు. చట్టానికి వ్యతిరేకంగా నడిచి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నూతన సంవత్సర వేడుకలను ప్రతి ఒక్కరు ప్రశాంతమైన వాతవరణంలో జరుపుకోవాలన్నారు.

సీఆర్టీ, సీఆర్పీల సమస్యలను పరిష్కరించాలి

మరిపెడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బాగాంధీ స్కూళ్లలో పని చేస్తున్న సీఆర్టీలు, ఎస్‌ఎస్‌ఏలో పని చేస్తున్న సీఆర్పీల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పెద్దబోయిన వీరబాబు డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం స్థానిక నాయకులతో కలిసి మరిపెడ తహసీల్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ సైదులుకు వినతి పత్రం అందజేశారు. ఆందోళనలో ఆ సంఘం నాయకులు అక్షిత్, చరణ్, మణికుమార్, మణికృష్ణ, పర్హాన్, దివ్య, అఖిల, జ్యోష్ణ, శృతి పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్సుమెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎదుట ఎస్‌ఎఫ్ఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్వాతంత్ర్య, ప్రజాస్వామ్య, సోషలిజం జెండాను జూనియర్ కళాశాల బాలుర కళాశాల కమిటీ అధ్యక్షుడు రాము జెండాను ఆవిష్కరించారు.

కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తగూడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న 2012 మంది కాంట్రాక్ట్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్(ఆట) జిల్లా అధ్యక్షుడు పెనుక ప్రభాకర్ డిమాండ్ చేశారు. కొత్తగూడలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ప్రభాకర్ మాట్లాడుతూ సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తు ఏటూర్‌నాగారం, ఉట్నూర్, భద్రాచలం, మన్ననూర్ ఐటీడీఏ కార్యాలయాల ముందు కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు నిరవధిక సమ్మె చేస్తున్నారని పేర్కొన్నారు. ఆట జిల్లా నాయకులు రేగ పాపారావు, మద్దెల సారయ్య, చుంచ కొమ్మాలు, అల్లెం వెంకటయ్య, విజయలక్ష్మి, సరస్వతి, విజయ పాల్గొన్నారు.

కాళోజీ వాకర్స్ అసోసియేషన్‌కు ఉత్తమసేవా పురస్కారం

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ కాళోజీ వాకర్స్ అసోసియేషన్‌కు ఉత్తమ పురస్కారం లభించింది. 2024 సంవత్సరంలో చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గాను అవార్డు లభించింది. ప్రతీ ఏటా నిర్వహించినట్లుగానే 2024 సంవత్సరానికిగాను వాకర్స్ ఇంటర్నేషనల్ 303 ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల పరిధిలోని మానుకోట కాళోజీ వాకర్స్ అసోసియేషన్‌కు పురస్కారం దక్కింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరులో ఆదివారం రాత్రి జరిగిన 33వ ఇంటర్నేషనల్ వాకర్స్ కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ వాకర్స్‌అసోసియేషన్ అధ్యక్షుడు వి. మురళీమోహన్‌రావు చేతుల మీదుగా కాళోజీ వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు డాక్టర్ డోలి సత్యనారాయణ, నామిరెడ్డి వెంకట్‌రెడ్డి, సోమవిష్ణువర్ధన్, రాచకొండ ఉపేందర్ అందుకున్నారు. కాళోజీ వాకర్స్ అసోసియేషన్ సభ్యుల సమిష్టి కృషితోనే ఉత్తమ పురస్కారం లభించిందని వారు తెలిపారు.

విద్యార్థి ఉద్యమ పోరాటాల వేగుచుక్క ఎస్‌ఎఫ్ఐ

కురవి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి ఉద్యమ పోరాటాల వేగుచుక్క ఎస్‌ఎఫ్ఐ అని జిల్లా కన్వీనర్ గంధసిరి జ్యోతిబసు అన్నారు. కురవి మండల కేంద్రంలో ఎస్‌ఎఫ్ఐ 55వ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1970 డిసెంబర్ 30న కేరళలోని త్రివేండ్రంలో అధ్యయనం-పోరాటం నినాదంతో ఏర్పడ్డ ఎస్‌ఎఫ్ఐ 55 సంవత్సరాలుగా విద్యారంగ, విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో మనోజ్, వరుణ్, పూజేష్, స్వప్న, అక్షిత, హరిణి, అనూష, సరిత, కార్తీక్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సాంఘికశాస్త్ర ప్రతిభ పోటీలకు ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవరి 4న జరిగే సాంఘీకశాస్త్ర ప్రతిభ పోటీలకు 72 మంది ఎంపికైనట్లు సాంఘీకశాస్త్ర ఫోరం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్వరూపరాణి, ఉమాదేవి తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో సోమవారం సాంఘీకశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి సాంఘీకశాస్త్ర ప్రతిభ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థుల్లో ప్రతి మండలం తెలుగు మీడియం నుంచి ఇద్దరు, ఇంగ్లీష్ మీడియం నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 72 మంది జిల్లాస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయా మండలాల సాంఘీకశాస్త్ర ఫోరం బాధ్యులు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

మిర్చిలో ఆకు ముడత తెగులుపై శాస్త్రవేత్తల సమగ్ర సర్వే

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :మిర్చి పంటలో వచ్చే ఆకు ముడత తెగులుపై శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మల్యాలలోని జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఆకు ముడత తెగులు కలిగించే వైరస్(సిల్లి లీఫ్ కర్ల్ వైరస్)పై సోమవారం జిల్లాలో పలు మిర్చి తోటల్లో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త ప్రశాంత్ మాట్లాడారు. సస్యరక్షణ వ్యూహాలను అమలు చేయడానికి శాస్త్రవేత్తల సూచనలు పాటించాలన్నారు.

మానుకోట అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



హుస్సేన్‌నాయక్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులుఉ

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపల్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.300 కోట్ల నిధులు మంజూరు చేయించేలా కృషి చేయాలని స్థానిక మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్‌నాయక్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానుకోట పట్టణం కురవి రోడ్‌లోని ఫ్లైఓవర్ నుంచి బేతోలు వరకు ఎన్‌హెచ్-365పై డివైడర్లు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు బీటీ రోడ్డుతో ఫోర్‌లైన్‌ను విస్తరణ చేయాలన్నారు. గాయత్రిగుట్ట నుంచి జమాండ్లపల్లి వరకు డివైడర్లు, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసి ఫోర్‌లైన్‌ను విస్తరించాలన్నారు. సిగ్నల్ కాలనీ సమీపంలో ఇప్పటికే మంజూరైన ఆర్వోబీని నిర్మించే విధంగా కృషి చేయాలని కోరారు. బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ చిట్యాల జనార్ధన్, మార్నేని రఘు, డౌలాగర్ శంకర్, అంబాల శివ పాల్గొన్నారు.

నల్లగొండ సభకు తరలిన సీపీఐ శ్రేణులు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) శత వార్షికోత్సవ (వంద సంవత్సరాలు) సభకు మహబూబాబాద్ జిల్లా నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారధి నాయకత్వంలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి పార్టీ శ్రేణులు తరలిపోయారు. మహబూబాబాద్ పట్టణం వీరభవన్ నుంచి తొమ్మిది వాహనాల్లో సీపీఐ నాయకులు, కార్యకర్తలు నల్లగొండకు వెళ్లారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి. విజయసారధి మాట్లాడుతూ....వందెళ్ల కిందట ఆవిర్భవించిన సీపీఐ నాటి నుంచి నేటి వరకు ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నల్లగొండకు తరలిన వారిలో మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారధిరెడ్డి, పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, తండా సందీప్, వీరవెల్లి రవి, చిదిరాల జ్ఞానేశ్వర్, మంద శంకర్, తండా శ్రీనాథ్, ఘక్క నాగార్జున, డొనికన రమేష్ ఉన్నారు.

60 అడుగుల రోడ్డుగా మార్చాలి

కేసముద్రం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం అంబేద్కర్‌సెంటర్ నుంచి కేసముద్రం విలేజి దర్గా వరకు రోడ్డు విస్తరణను 60 అడుగుల వరకే చేపట్టాలని కోరుతూ సోమవారం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డికి పలువురు దుకాణదారులు, ఇళ్ల యజమానులు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ(యూ) జిల్లా అధ్యక్షుడు కంచ వెంకన్న మాట్లాడారు.ఇటీవలె 80 అడుగులకు రోడ్డు వెడల్పు కోసం మార్కింగ్ వేయడంతో చాలా మంది దుకాణాలు, ఇళ్ల కోల్పోతున్నామని తీవ్ర ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. అలాగే ఇళ్ల కోల్పోయే వారికి ఇందిరమ్మ ఇల్లు, పాక్షికంగా కోల్పోయే వారికి రూ.2లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరారు. కమ్యూనిస్టు నాయకులు మార్తినేని పాపారావు, శివారపు శ్రీధర్, మోడెం వెంకటేశ్వర్లు, దుకాణా దారులు జంపాల రమేష్, రాయబారపు హరికృష్ణ, కొత్తకొండ యాదగిరి, పాల్గొన్నారు.

హెచ్‌ఎం రాములుపై దాడి చేసిన వారిని శిక్షించాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వహిస్తున్న దళిత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కంబాలి రాములుపై దాడి చేసిన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జాతీయ నాయకులు పార్నంది రామయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో సోమవారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. హెచ్‌ఎంపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

మిత్రవాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మిత్రవాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కటికరెడ్డి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మహబూబాబాద్ పట్టణంలో మిత్ర వాకర్స్ అసోసియేషన్ సర్వసభ్యసమావేశాన్ని సోమవారం గంధసిరి ఉప్పలయ్య అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం 2024-2026 సంవత్సరానికి వాకర్స్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కేదాసు వాసుదేవ్, మాడిశెట్టి సూర్య ప్రకాశ్, ప్రధాన కార్యదర్శిగా నలసాని ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారిగా ఉప్పల శ్రీనివాసులు, కార్యదర్శులుగా వంగేటి సురేష్‌రెడ్డి, శ్రీరామోజు రామారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా దేశబోయిన రాంమూర్తి, గౌరవ సలహదారులుగా సాదుల శ్రీనివాస్, ఘనపురపు అంజయ్య, ముల్లంగి ప్రతాప్‌రెడ్డి, సంకా బద్రినారాయణ, తక్కెళ్లపల్లి ప్రభాకర్‌రావు, సోమ రాంరెడ్డి ఎన్నికయ్యారు.

కోరుకొండపల్లిలో ధర్మన్న వర్ధంతి

కేసముద్రం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోరుకొండపల్లిలో కమ్యూనిస్టు నేత ధర్మన్న 24వ వర్ధంతిని సీపీఐ మండల కార్యదర్శి చొప్పరి శేఖర్ అధ్యక్షతన ఆదివారం రాత్రి నిర్వహించారు. గ్రామంలోని ధర్మన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి విజయసారధి, మానుకోట మునిసిపల్ ఫ్లోర్ బి.అజయ్‌సారథిరెడ్డి, ధర్మన్న కుమారుడు ఎన్నారై రంజిత్‌రెడ్డి, మంద భాస్కర్, కాసు సాయిచరణ్, ఎస్‌కె.ఇమాం పాల్గొన్నారు.

మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్

మరిపెడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్‌ను సోమవారం స్థానిక హైస్కూల్‌లో నిర్వహించారు. ఇంగ్లిష్ మీడియంలో మోడల్ స్కూల్‌కు చెందిన గండి సాయి, మరిపెడ హైస్కూల్‌కు చెందిన దామోదర్ ప్రథమ, ద్వితీయ స్థానం, తెలుగు మీడియంలో వీరారం హైస్కూ ల్‌కు చెందిన శ్రీకాంత్ ప్రథమ బహుమతి అందుకున్నారు. ఈ వి ద్యార్థులను ఎంఈవో అనితాదేవి, హెచ్‌ఎంలు అభిన దించారు.

● తొర్రూరు, (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలుంటాయని సోషల్ టీచర్స్ అసోసియేషన్ కన్వీనర్ ఎ. బ్రహ్మానంద రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సోషల్ స్టడీస్ ప్రతిభా పాటవ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల్లో కంటాయపాలెం హైస్కూల్‌కు చెందిన టీ రిషిక, ఈ నవ్యశ్రీ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, జనవరి 4వ న జిల్లా కేంద్రంలో జరిగే పోటీలో వీరు పాల్గొంటారన్నారు. ఉపాధ్యాయులు డీ శంకర్, కే అనంత రెడ్డి, యాకూబ్ అలీ, నాగరాజు, చంద్రమౌళి, యాకస్వామి, రాజు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

దంతాలపల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఈనెల 26న ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతున్న జాటోత్ బీక్యా (72) సోమవారం మృతి చెందినట్లు ఎస్సై రాజు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అడ్డగూడురు మండలం రాపాకకు చెందిన రాపోల కనకయ్య బీరిశెట్టిగూడెం వైపు నుంచి తొర్రూరుకు వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొని బీక్యా తీవ్రంగా గాయపడ్డాడు. వరంగల్‌లో చికిత్స పొంది ఇంటికి వచ్చారన్నారు. ఈ క్రమంలో బీక్యా ఆరోగ్యం విషమించింది. సోమవారం చికిత్స కోసం వరంగల్ తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య జగ్ని ఫిర్యాదులో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కొత్తగూడ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ మండలం వేలుబెల్లిలో కొనకటి పెద్ద సంపత్‌కు రూ, 30వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ను సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అల్లాడి రాజు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దొంకదూక కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వజ్జ రమేష్, మైనారిటీ సెల్ జిల్లా నాయకుడు పాష, నాయకులు కుమ్మరిగుడి సునీల్, కొనకటి మల్లారెడ్డి, కొక్కు సంపత్, కురిమిళ్ల రాజు, గుండ్రకోట రాజు, పెంతల రాజేందర్, శ్రీను పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

గార్ల డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న సాంకేతిక పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ఉన్నత పాఠశాలల్లో సైబర్ నేరాలపై విద్యార్థిని, విద్యార్థులు అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎస్‌కే రీయాజ్ పాషా సూచించారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహిం చారు. అనంతరం విద్యార్థులకు అల్పహారం అందించారు. ఉపాధ్యాయులు మాచర్ల సుందర్ కుమార్, అబ్దుల్లా,సిబ్బంది శ్రీను పాల్గొన్నారు.

రైతు సమస్యలను పరిష్కరించాలి

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అఖిలభారత యూనైటెడ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి పాయం చిన్న చంద్రన్న డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో సోమవారం డిమాండ్స్‌డే పోస్టర్లను ఆవిష్కరించారు. కొత్తపల్లి రవి, ఫైండ్ల యాకయ్య, బిల్లకంటి సూర్యం, బండపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జైకిసాన్ రైతు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కేసముద్రం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) :కేసముద్రంలో సోమవారం జైకిసాన్ రైతు పరస్పర సహాయక సహకార పొదుపు పరపతి మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 2025 క్యాలెండర్‌ను మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గండి శ్రీనివాస్, మూల భూలోకరెడ్డి, వంగాల కొమ్మాల్ రెడ్డి, మార్తినేని పాపారావు, జహిందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌ఎంపై మతోన్మాదుల దాడిని ఖండించాలి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ గ్రామ ఉన్నత పాఠశాలలో దళిత హెచ్‌ఎం రాములుపై మతోన్మాదులు చేసిన దాడిని ప్రతీ ఒక్కరు ఖండించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సోమవారం నిర్వహించిన సీఐటీయూ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు, సమ్మెట రాజమౌళి పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న యువకుల అరెస్టు

తొర్రూరు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి సేవిస్తున్న యువకులను అరెస్టు చేసిన ఘటన సోమవారం రాత్రి తొర్రూరులో చోటు చేసుకుంది. తొర్రూరు పట్టణ శివారులో కొందరు యువకులు గంజాయి సేవిస్తుండగా పోలీసులు పక్కా సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి విచారణ చేపడుతున్నారు. వారికి గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది. ఎవరు సరఫరా చేస్తున్నారు. ఎంత మొత్తంలో గంజాయి వారి వద్ద ఉందనే కోణంలో విచారణ కొనసాగినట్లు తెలిసింది. దీనిపై ఎస్సై ఉపేందర్ స్పందించారు. గంజాయి సేవిస్తున్న సమాచారంతో కొందరిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దవంగర, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అవుసలితండాలో అక్రమంగా నిల్వ చేసిన రూ.80వేల విలువ చేసే 40 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై క్రాంతికిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి గ్రామ శివారు దయ్యంతండాకు చెందిన మడోత్ కల్యాణ్, మడోత్ వినోద్ వివిధ గ్రామాల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసి హైదరాబాద్‌కు తరలించేందుకు నిల్వ చేశారు. వారి నుంచి రూ.80వేల విలువ చేసే బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కేంద్రమంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగా పార్లమెంటులో మాట్లాడిన కేంద్రహోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని వామపక్ష పార్టీల నాయకులు సాదుల శ్రీనివాస్, బి. విజయసారధి, మండల వెంకన్న, పాయం చిన్నచంద్రన్న డిమాండ్ చేశారు. అంబేద్కర్ అవమానపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తీరును వ్యతిరేకిస్తూ మహబూబాబాద్ అంబేద్కర్ విగ్రహం ఎదుట సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సూర్నపు సోమయ్య, అజయ్‌సారధిరెడ్డి, సమ్మెట రాజమౌళి, గుజ్జు దేవేందర్, పగిండ్ల యాకయ్య, బానోత్ సీతారాంనాయక్, పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, హలావత్ లింగన్న, సామ పాపయ్య, రాంమూర్తి పాల్గొన్నారు.

● గార్ల (ఆంధ్రజ్యోతి) : భారత పార్లమెంటులో డాక్టర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం వామపక్షాల ఇద్వర్యంలో స్థానిక నెహ్రూ సెంటర్‌లో అమిత్‌షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలని రాస్తారోకో నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, న్యూడెమోక్రసీ నాయకులు జడ సత్యనారాయణ, జి. సక్రు, వెంకటేశ్వర్లు, నాగరాజు, మాన్య నాయక్ పాల్గొన్నారు.

● తొర్రూరు, (ఆంధ్రజ్యోతి): అమిత్ షాను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్, సీపీఐ నాయకుడు ఓమ భిక్షపతి, న్యూడెమోక్రసీ లింగయ్య, సాయిలు, ఎండీ యాకూబ్, బందు మహేందర్, మార్క సాంబయ్య, శ్రీను, మల్లయ్య పాల్గొన్నారు.

● కురవి, (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రివర్గం నుంచి హోమ్‌శాఖ మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా నాయకులు నల్లపు సుధాకర్ డిమాండ్ చేశారు.ఈ మేరకు కురవిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్, భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలన్నారు. సీపీఎం నాయకులు గంధసిరి శ్రీనివాస్, చలగోల మల్లయ్య, ఆమెడ నాగయ్య, కట్ల కృష్ణ, జ్యోతిబసు, సీతారాం, రాములు పాల్గొన్నారు.

● కొత్తగూడ, (ఆంధ్రజ్యోతి) :భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే భర్తరఫ్ చేయాలని ఎన్డీ జిల్లా నాయకుడు భూర్క వెంకటయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడలో సోమవారం అమిత్‌షా దిష్టిబోమ్మను ఎన్డీ నాయకులు దహనం చేశారు. ఎన్డీ సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి శ్రీశైలం, నాయకులు రాజమల్లు, సువర్ణపాక పుల్లక్క, రామ్‌సింగ్, నిర్మల, రామస్వామి పాల్గొన్నారు.



అంబేద్కర్ సెంటర్‌లో ధర్నా నిర్వహిస్తున్న వామపక్ష పార్టీల నాయకులు